# 'మద్రాసీ'

[పూనాలో ఆంధ్రవిద్యార్థులు కొందరు చేసిన చేతకు కథారూపమైన ఈ వృత్తాంతము ఆంధ్రులు శ్రద్ధతో చదవతగివుంది. హిందూదేశంలో వివిధ ప్రాంతాల్లో వుండే ఆంధ్రవిద్యార్థులు ఇట్టి చిల్లరి చేష్టలు చేస్తూవుండడం అప్పుడప్పుడు వింటూవుంటాము. ఇట్టి చేష్టలు ఆంధ్రకీర్తికి భంగకారులు కాని అన్యం కాదు. ఆసంగతి నొక్కి చెప్పడానికే మేమీ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము. —సంపాదకుడు.]

రచయిత:

## బూర్గుల రంగనాథరావు

### ౧

...ఒకే ప్రవాహంవలె వుంటుంది జనసమ్మర్దం. ఈ ప్రవాహంలో ముసలాళ్లు వికలాంగులు చిలుమెక్కిన మనుష్యులు వుండరు. అంతా అందమయిన వాళ్లు వయసుపిల్లలు. విద్యార్థులు, విద్యార్థినులు. అందరూ సామాన్యంగా తెల్లగావుంటారు. మగవాళ్లు ట్వీడ్ కోట్లు వేసుకుంటారు. ఆడవాళ్లు సగంమంది మనమోస్తరే గూడకట్టు చీరలు కడతారు. తక్కిన సగంమంది యేనుగు తొండంలాంటి గోచీలతో బయలుదేర్తారు. లోలక్కులు ఇంకా, కాస్మెటిక్కు అన్నీ వుంటాయి. వీళ్ళలోని అమోఘమైన శరీరచ్ఛాయే—కాంతి కాదు—తక్కిన లోపాలన్నింటినీ సవరించివేస్తుంది. హాలీవుడ్ తారల తలదన్నేట్లు కొందరు మరీ విచిత్రంగా తయారవుతారు. బ్రాహ్మణకుటుంబాలకు చెందిన పడుచులుకూడా యిరానీ రెస్టారెంట్లలో ఆమ్లెట్లూ, మటన్, పోలావులూ తింటారు. బీర్ గీర్ కూడా యెక్కిస్తారనుకుంటాను. ఎద్దుల్లాగ అందరినీ రాచుకుంటూ పోవడం, పెద్ద వస్తాదుల్లాగ చూస్తూపోవడం తప్ప చురుకుదనం, చొరవ, కామన్సు వీళ్ళలో మృగ్యం. 'సెక్సు' అంటూవున్నట్టే ఫీల్ అవరు మగవాళ్ళతో బాగానే— అంటే తమ మహారాష్ట్రులతో— కలిసి తిరుగుతారు. అన్ని ఆటల్లో పాల్గొంటారు. మోటారుసైకిళ్లుగూడా యెక్కుతూంటే సైకిళ్లు వీళ్ళకో హ లెఖ్ఖా! అన్నిట్లోనూ మగవాళ్లకంటే వీళ్ళదే పైచేయి. మగవాళ్ళను యేడ్పిస్తారుకూడాను. ఏమన్నా అంటే తంతారుకూడానట. ఎంత ప్రాంతీయ సంకుచితత్వం? యెంతఆత్మస్తుతి, పరనింద? అనుకున్నావ్! చెప్పలేను. పూనాకు దక్షిణంనుండి వచ్చినవాడినల్లా 'మద్రాసీ' అనేసి హేళనచేస్తారు......కాని యీ మహారాష్ట్రులకున్న ప్రాంతీయత, వాళ్ళ స్త్రీలకున్న ధైర్యసాహస బలాలు మన ఆంధ్రులకు, ఆంధ్ర స్త్రీలకు వుంటేనా? నీవు అడిగావు గాబట్టి యీమాత్రమైనా వ్రాశాను. ఓ చిన్న ట్రిప్ కొట్టదలచుకుంటే బాగానే వుంటుంది. వచ్చేయ్.'

సుందరం వ్రాసిన యీవుత్తరంలోని వాక్యాలను మళ్ళీమళ్ళీ చదువుకొని, కుటుంబరావు చివరకి పూనా వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

### ౨

కుటుంబరావు పూనావచ్చి వారంరోజులైంది. ప్రతినిత్యం, సాయంత్రం ఆరుగంటలకు పుట్టి యేడున్నరకు మాయమై తొమ్మిదింటికల్లా యెడారిగా మారే ఆయువ్వనుల ప్రవాహంలో తానూ కొట్టుకపోతూన్నాడు.

మొదటిదినం అక్కడి యువతుల ప్రవర్తన అంతు తెలీకండా వుంది.

కుటుంబం సామాన్యుడుకాడు. ఆంధ్రదేశం అంతటా హడలెత్తించి మద్రాసులోకూడా మంచి రికార్డు స్థాపించిన అథ్లెట్. 'ప్రాక్టికల్ రొమాన్సర్' అని పేరుపొందినాడుకూడా. చూడగానే 'బలాఢ్యుడు, చురుకైనవాడు' అని చెప్పవచ్చు. ఆ విశాలమైన పచ్చని వక్షాన్ని,

చిరునవ్వులు చిమ్మే బుగ్గలకు ఆరడుగుల వున్న తాకారాన్ని చూసి అతని క్లాసుమేట్లు అసూయపడేవారు. తనకు తెలియకుండానే, తనయిష్టంలేకున్నా తనని వల్లో వేసుకున్న ఒకరిద్దరు అమ్మాయిలు అతనికి నైట్ మేర్సు! ప్రతివాడూ, 'నీలో స్త్రీలనేకాదు పురుషులనుకూడా ఆకర్షించే చార్మువుందిరా' అంటే ఉబ్బిపొయ్యేవాడు.

కాని యీపూళ్ళో ఆ కాంప్లిమెంట్లన్నీ నిరర్థకంగా కనుపడుతున్నాయి. ...ఎన్నాళ్లు యిట్లా సుందరంగదిలో తండులధ్వంసంచేస్తూ వుంటాడు యే అద్వెంచరూ లేక ?

సరే చివరికి ఓనాడు ఓవిద్యార్థినిని చూసి ప్రయత్నం ప్రారంభించాడు.

మొదటిరోజు బాగా కళ్లు కలిశాయి.

రెండోరోజు మాపులూ భుజాలూ రాసుకున్నాయి.

మూడోనాడు కనుపడలేదు.

చిరునవ్వులు మాపులను తోడ్పడ్డాయి నాలుగోరోజున.

మరునాడుమాత్రం ఆ అమ్మాయి తను భాషలో తన స్నేహితురాళ్ళతో యేమో చెప్పి కుటుంబరావును పరిహాసంచేసింది.

కాని తానుకూడా తెలుగులో నాలుగుతిట్లు తిట్టి నాళ్ళకన్నా పెద్దగా నవ్వి పరాభవించాడు. కాని రావును ఆ ప్రతిక్రియతో తృప్తి కాలేదు.

## ౩

ఇంకో నాలుగురోజులు గడిచాయి. ఆరోజు సాయంత్రము ఆ అమ్మాయి అద్భుతంగా కనుపడింది. నల్లచీరలోనుంచి ఆమె గులాబీ యవ్వన సౌరభం పొయ్యేవాళ్ళని ఉన్మత్తులను చేస్తోంది. సరీగా భుజంపైకివచ్చి ఆగిపోయిన తెల్లని జార్జెటు బ్లౌజులోనుంచి మృదువైన కమ్మని వాసనలనీనే చేతులూ శృంగార కళాన్వితమైన యవ్వనరాసులు యెంత దాచగూడదనుకునే కళ్ళనైనా తమవైపు లాక్కుంటూవున్నాయి. ప్రతి కదలికలో లావణ్యం, మార్దవం, రసికత ఉట్టిపడుతున్నాయి. పెదవులమీది రక్తరేఖ, హృదయాల్ని చీల్చేసే కళ్లు కుటుంబాన్నే కాదు సర్వ ప్రపంచాన్నే తలక్రిందుల చేస్తున్నాయి.

'నేను ఈ వేళ తప్పకుండా మాట్లాడిస్తాను...నీవు వెనక్కి వెళ్ళిపో' అని వెనకాలేనడుస్తున్న కుటుంబరావు, సుందరంతో చెప్పి, కొంచం జనం తక్కువగా వున్నచోట, ఆమె పక్కనే వెళ్ళి యెంతో పరిచయమున్న వాడికిమల్లే మందహాసంతో, 'హలో' అన్నాడు.

'హల్లో' అంది నవ్వుకు తోడుగా గాంభీర్యం కనబరుస్తూ.

'మీతో నడువవచ్చా కొంతదూరం?'

'నాకెందుకు అభ్యంతరం వుండాలి?'

'ధన్యుణ్ణి' అన్నాడు కుటుంబరావు.

తరువాత పేర్లు-చదివే తరగతులూ మొదలకు అనవసరమైన తప్పనిసరి శుష్కప్రసంగాలు జరిగాయి.

ఆమె పేరు కుసుంభిడే అనీ, సీనియర్ బి.ఏ. చదువుతోందని తెలుసుకున్నాడు. కుసుంవాళ్ళ యిల్లు సమీపించగానే, 'యిక్కడే మాయిల్లు...రండి:' అంది, కుటుంబరావువైపు చూడకుండా కొంటె నవ్వును పెదవులమధ్య నొక్కిపెడుతూ.

'క్షమించండి,,,కొంచెంపనివుంది... మళ్ళీ ఓమారు దర్శనం చేసుకుంటాను...' అని చెప్పి కుటుంబరావు సుందరంగదికి వచ్చేశాడు.

వచ్చే రావడంతో నే సుందరం టిఫిన్ క్యారియర్లోనుంచి అన్నం వడ్డిస్తూ, 'ఏమేం జరిగింద'ని అడిగినాడు.

'ఆకేయ్...పిట్ట దొరికిందన్నమాటే?'

'ఆఁ! యెముకలు విరగ్గొట్టించుకునేవ్ ...జాగ్రత్త!'

'ఏడిశావ్!... మొదటినుంచీ చెబుతా విను...కాని చాల స్కౌండ్రెల్ గా కనుపడుతుందిరా! నాపేరు అడిగింది, నన్ను గురించి అంతా తెలుసుకోవాలని సి.ఐ.డి వలె పరీక్షించింది. నేను బాగా కోశాను... చివరకి తనయింట్లోకి రమ్మందోయ్!'

'వెళ్లావా?'

'వెళ్తానా? వెఱ్ఱివాడిని కాను. నాకు వెంటనే తెలిసింది దాని అభిప్రాయం: నన్ను ఫూల్ చేసి తన్నిద్దామని దాని ఆలోచన... నేను సాగనిస్తానా? శాస్తి చేయాలని చూస్తున్నాను. నీవు మాత్రం మనగదిని బాగా డాబుసరిగా అలంకరించి వెయ్యి, ఇంకోమాట రహస్యం! నీవొక వేషం వెయ్యాలి ... చెబుతా తర్వాత......'

'నాగదిలో వుంటున్నానని చెప్పావా?'

'లేదు. కాని నా పేరు చెప్పినప్పుడు మద్రాసీవా?' అంది. కాను 'ఆంధ్రులం' అంటే తెలియలేదు. సవిస్తరంగా చెప్పాక కూడా 'అదే మద్రాసీ' అంది. 'సరే మీరల్లాగే పిలువాలనుకుంటే నాకు అభ్యంతరంలేద'ని చెప్పాను.'

## ౪

మరునాడు యథాప్రకారంగా షికారు వెళ్లుతూంటే 'సమాసంసార్' పిక్చ

రుకు రమ్మని ఆహ్వానించాడు కుటుంబరావు కుసుంని. 'సరే, థియేటరుదగ్గిరే కలుసుకుందామ'ని ఆమె వప్పుకోవడం కుటుంబానికి చాల ఆశ్చర్యం కలిగించింది.

కుటుంబం అనుకున్నంతే అయింది. కుసుంతోపాటు యిద్దరు యువకులూ, యింకో స్నేహితురాలూ వచ్చారు. కుటుంబరావుగూడా తన ప్లాన్ ప్రకారం ఒక తెలుగు పడుచును సినిమాకు వెంటతీసి కొచ్చాడు.

అసలు, కుసుంను తాను పిక్చరుకు రమ్మన్న సంగతే మరచినట్టు అతడు ఆమెతో మాట్లాడనేలేదు. చాల కఠినంగా యిగ్నోర్ చేశాడు. కాని ఒకరిజట్టులో యింకోరు పుట్టినట్టు మాత్రం గ్రహించి ఒక్క చూపు చూసుకున్నారు. నిశ్శబ్దంగా అంతా వెళ్ళి లోపల కూచున్నారు.

కుటుంబం, అతని క్రొత్త స్నేహితురాలు తియ్యని తెలుగులో, ఇంగ్లీషు వారికన్న మధురంగా యింగ్లీషులో మహా ఉల్లాసంగా మాట్లాడుకుంటున్నారు. రాజకీయాలు, ఆర్టు, సినిమాగురించి, కుటుంబరావు అతని చేతిలో వొదిగివున్న ఆ అమ్మాయి, అత్యద్భుతంగా తెలివిగా మాట్లాడుకొంటూవుంటే కుసుం ఆమె స్నేహితులూ దంగైపోయారు. తమజ్ఞానానికి తామే సిగ్గుపడ్డారు. కుటుంబంకన్న ఆ కొత్తవ్యక్తే తన సభ్యత, వైదుష్యం అంతా వుట్టిపడేట్లు మాట్లాడుతో వుండగా, చీకట్లోనే కనిపెడుతూన్న కుసుంకు భరించడం కష్టంగా తోచింది.

ఒకవిధమైన కొంటెతనంతో కుటుంబానికి బుద్ధి చెప్పదామనుకున్న కుసుంను స్త్రీ సహజమైన ఈర్ష్యపీక్కుతింటోంది. ఆ ఉద్దేశ్యాలన్నింటికీ స్వస్తి చెప్పి అతన్ని యేమీ అనవద్దని తన స్నేహితులకు చెప్పింది. కాని తనతో మాట్లాడకండా అతడు యింకో స్త్రీ ప్రక్కన అలా వుండడం సహించక అలోచిస్తూ కూచుంది పిక్చరు చూడకండా.

అలంకారంలోనేమి, చొరవలోనేమి, ఫ్యాషన్‌లోనేమి తనకన్నా మిన్న అయిన ఆకొత్త అమ్మాయి, తన్ను ఫూల్ చేయ దలుచుకున్న యువకుణ్ణి ప్రేమకు దాసియై అతన్ని పూజించడం కుసుంకు అత్యాశ్చర్యం కలిగించింది. ఇదివరకే తానే కుటుంబరావును వశపరచుకోనందుకు పశ్చాత్తాప పడింది...

కాని వెంటనే మహారాష్ట్రగర్వం, ప్రాంతీయత ఈ'మద్రాసీ'లను క్షమించలేదు. 'వనవిహంగాలవలె యెలా హాయిగావున్నారు! ఎంత మధురంగా ఎంత నవనీత మృదులంగా వున్నాయి ఆ యింగ్లీషు తెలుగు కలిసినమాటలు. ఏం చక్కనవుతుంది! ఎంత ఆనంద మిస్తున్నది తన ప్రియుడికి మనములా యింగ్లీషు మాట్లాడమేం? మనమహారాష్ట్రం కూడా యిట్లా మాట్లాడమే! ఇంత రసికత్వంతో ఏయువకుడితోనైనా ఒక నిముషమైనా గడిపానా! ప్చ్...ఛ! ఏవిటిది? ఇలా అనుకుంటున్నాను! మహారాష్ట్రజాతిని మహారాష్ట్రస్త్రీనా మహారాష్ట్రభావనా నేను తొంచపరుస్తున్నది? మూర్ఖం! కిందపడినా పైకాలు నాదే అనే పట్టుదలవుండాలి... అయినా యిదేవిటి కుటుంబరావుతో యింతపరిచయం, చనువు? నాకెందుకూ వాడెట్లాపోతే? మనసు అతడంటే యెందు కలా గింజాలాడుతుంది?...ప్రేమిస్తున్నానా? నాకు తెలీకండానే ప్రేమిస్తున్నానా? ఛ! 'మద్రాసీ'ని ప్రేమించడమేమిటి? అయితేమాత్రం?...యేమో అంతా అయోమయంగావుంది. ఏమైనా కుటుంబరావును పోగొట్టుకోగూడదు. అతని కామానికీ లొంగకూడదు. అతన్ని ఆమెనుండి విడదీశేశక్తి, ఆకర్షణ నేనుసంపాదించుకోవాలి'ఇలాంటి ఊహాపరంపరలు ఆమె తల్లో తిరిగిపోయాయి.

పిక్చరయిపోయింది.

ఏపార్టీకి ఆపార్టీ నిశ్శబ్దంగా యిల్లు చేరుకుంది.

మరునాడు 'వాక్'కు పోతూవుంటే కుసుం కుటుంబరావులు కలుసుకున్నారు ఇద్దరు నిర్మొహమాటంగా గంభీరంగా మాట్లాడుకుంటున్నారు.

కుసుం తన మనసులోని భావాలు పైకి తెలినీకండా.

'రాత్రి మేమూ పిక్చరుకి వచ్చాను' అంది.

'అవును మేము చూశాము. క్షమించండి... మీరంతావున్నారు కాబట్టి...'

'నేనూ అంచేతే మీతో మాట్లాడలేదు... ఆమె...'

'ఆమె పేరు విమల. నాగదిలోనే వుంటుంది. మాబంధువు. ఓ.చిన్న ట్రిప్ తీసుకుంది పూనాకు.'

'మీ వెంట పికారురాదే రోజూ?'

'మా స్నేహితుడివెంట టెన్నిస్‌కు వెళ్తూంటుంది.' కుసుం కొంచంసేపు మౌనంవహిస్తుంది.

'మీకేంభయం? మా మద్రాసీలవలె మీకు భయంగావుందా వంటిగా వెళ్ళడంకి?'

'అబ్బే భయమెందుకూ? పదండి' అంటూ మొహం సవరించుకొని తడ

బహుతూ వప్పుకుంది కుసుం. యిద్దరూ కలిసి సుందరంగదికి వచ్చేశారు.

ఆకర్షణీయంగావుంది. కళాకారులూ అందమైన ఉత్తమజాతి స్త్రీలు వుండే గదివలె తయారయింది. కుసుం గదిలోకి రాగానే కుటుంబరావు, విమల సంపన్న గృహస్థులు అత్యున్నతమైన సభ్యత కల వారు అని తెలిసికొంది. ఎదురుగావున్న సోఫాలో కూర్చుని, 'విమల' అని సంతకంచేసివున్న కొన్ని చిత్రాలను చూస్తూ!

'విమల గొప్ప ఆర్టిస్టే!... నిజంగా మీరు నన్ను అవమానపరిచారు, ఆమెతో పరిచయం కలిగించక' అంది.

'ఆం! ఏం ఆర్టిస్టండి! యేదో కుబుసుపోకకు గీసింది... నాకుమాత్రం మీలాగ బాగా శరీరబలంవుండి పోట్లాడే శక్తికలిగివున్నవాళ్ళంటేనే యిష్టం. మగరూపుఅవుతే యింకాయిష్టం!'

'వేళాకోళం చేస్తున్నారు... యింకా విమల రాలేదే!'

'మనయిద్దరం వున్నప్పుడు మీకు ఆమె చింత యెందుకూ?' అని కుటుంబం అంటే 'ఏం' అన్నట్టు ఆమె చూసింది.

దానికి 'మల్లెపూలముందర చీపురుపుల్ల ప్రశంసవలె వుంటుంది!' అన్నాడు...

'మీరు కవులాయేం?'

'ఈముక్కలోనే నాకవిత్వం కనుపడిందా?'

'లేదు మీమొహమ్మీదే ఆమాట రాసి వుంది.'

'ఆహా! ... కవిని పెళ్లాడుతారా? కుసుం' అని ప్రారంభించాడు కుటుంబరావు.

'మద్రాసీలనే—సారీ! అలా అంటే మీకు కోపంకదూ! — ఆంధ్రులన్నే! అన్నంతినేవాళ్ళనే' అని భుజాలు కదిలించి నోరుతెరచి వెకిలినవ్వు నవ్వింది కుసుం.

ఇహ వ్యవహారం పరిష్కారం చేయాలని, ఆమె నవ్వులోని లాలిత్యాన్ని-కాఠిన్యాన్ని భరించలేక, ఆమెనుగట్టిగా అదుముకున్నాడు.

తన శీలానికీ తనకూ తనవాళ్ళకూ అవమానం కలిగిందనీ, తను పరాభవింపబడుతున్నదనీ లేనికోపం తెచ్చుకొని. తన శరీంలో ఆకలికొన్న నరాలు యెంత 'వద్దని మొత్తుకుంటున్నా' వినక కుటుంబరావు చెంపమీద కొట్టింది.

దీనికి సిద్ధంగా నేవున్న కుటుంబరావు ప్రత్యుత్తరంగా చక్కటి యీడ్చివేసి కళ్ళనుంచి తోసివేసి, 'వెళ్లు అవతలకి పో! నీవు ఆగచి లాభంలేదు. నీవై నీవు నాగదిలోకివచ్చినట్టు సాక్ష్యం నామిత్రుడు అవతలవున్నాడు. లాభంలేదు కేసుపెట్టికూడా... నిన్ను చెరచే ఉద్దేశంతో తీసుకరాలేదు. మద్రాసీ సంగతి చూపిద్దామని తెచ్చాను. మద్రాసీ యిట్లా యెప్పుడూ చేయడు ... ఈవిషయం యెవరితోనూ చెప్పకొకు. నేనూ చెప్పనులే... కాని ఆంధ్రులకుకూడా ఆత్మగౌరవం వుందని గ్రహించుకో' అని ఒక్క గుక్కలో అనేసి బయటికి తరిమాడు.

కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ కుసుం వెళ్ళిపోయింది.

రెండురోజులింకా వుండి తనువచ్చిన పని అయినట్టు, సుందరంతో శలవు తీసుకొని యింటికి వచ్చేశాడుకుటుంబం.

కాని యింతకూ, విమలపాత్ర ధరించింది సుందరమేనని కుసుంకు తెలియనే లేదు పాపం.


# కథల పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| కారుణ్యం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| రూమ్ టులెట్ | 0 | 4 | 0 |
| —పిల్లలమఱ్ఱి బాలకృష్ణశాస్త్రి | | | |
| స్వగతం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| కలికి | 0 | 4 | 0 |
| —బొడ్డు బాపిరాజు | | | |
| బాప్తిస్మపత్రికం | 0 | 4 | 0 |
| —గుడిపాటి వెంకటచలం | | | |
| యువ కథావళి | 0 | 4 | 0 |
| —వివిధ రచయితలు | | | |
| ఇల్లరికం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| పాంచజన్యం | 0 | 6 | 0 |
| —చక్రపాణి | | | |
| బడదీదీ | 0 | 4 | 0 |
| —చక్రపాణి | | | |
| త్రిలోచన కవిరాజు | 0 | 6 | 0 |
| —చక్రపాణి | | | |
| గళ్లచీర (9 కథలు) | 0 | 8 | 0 |
| —పురాణం కుమారరాఘవశాస్త్రి | | | |
| ఉద్యానం (5 కథలు) | 0 | 5 | 0 |
| —పురాణం కుమారరాఘవశాస్త్రి | | | |

[పోస్టు ఖర్చులు ప్రత్యేకము]

## ఆంధ్రభూమి బుక్ డిపో

వేపేరి మదరాసు.


Printed at the Andhrabhumi Printing Works, 13 Mukhatal Street. Vepery P.O, Madras.
Editor & Publisher : Andra Seshagiri Rao B.A.